రేపే స్టాండింగ్ కమిటీ ఎన్నిక

- ఉత్కంఠగా జరగనున్న ఎన్నిక
- బరిలో ఆరు పోస్టులకు 12 మంది అభ్యర్థులు
- 56 మంది కార్పొరేటర్లకు ఓటు
- 10.30 నుంచి 3గంటల వరకు సాగనున్న పోలింగ్
- సోమవారం 4 గంటల కల్లా ఫలితాలు వెలువడే అవకాశం



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్టాండింగ్ కమిటీ ఎన్నికల అధికారి, ఏసీ చల్లా ఓబులేసు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు 12 సంవత్సరాల తరువాత కౌన్సిల్ ఏర్పాటైంది. 2021లో వైఎస్సార్ సీపీ పాలక వర్గం కొలువుతీరింది. గుంటూరులో 57 డివిజన్లకు 44 డివిజన్లలో వైఎస్సార్ సీపీ సభ్యులు గెలుపొందారు. అప్పటి నుంచి స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక వైఎస్సార్ సీపీ సభ్యులే ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వచ్చారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో తాజాగా కార్పొరేటర్లను తమవైపు తిప్పుకుని గెలవడం కోసం తెలుగుదేశం పార్టీ అన్ని అడ్డదారులు తొక్కింది. 11 మంది సభ్యులు ఉన్న కూటమి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేయడమే వారి అధికార కాంక్షకు అద్దం పడుతోంది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నగర ఎమ్మెల్యేలు కార్పొరేటర్లను ప్రలోభ పెట్టి వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను తమ పార్టీలో చేర్చుకున్నారు. దీంతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక తీవ్ర ఉత్కంఠగా మారింది. ఈ నేపథ్యంలో ఏ పార్టీకి ఆ పార్టీల వారు తమకే స్టాండింగ్ కమిటీ మెజార్టీ వస్తుందని ఊహాగానాల్లో ఉన్నారు.

విదేశాలకు వెళ్లిన కార్పొరేటర్‌నూ...

47వ డివిజన్‌కు చెందిన యర్రంశెట్టి పద్మావతి తన సొంత పనుల మీద విదేశాలకు వెళ్లారు. ఎన్నికల సమయానికి రాలేని చెప్పడంతో ఈ ఎన్నికలను ప్రెస్టేజ్‌గా తీసుకున్న కూటమి నేతలు పద్మావతి టికెట్ తీసి మరి గుంటూరుకు రప్పిస్తున్నట్లు సమాచారం. దీంతో ఎలాగైన స్టాండింగ్ కమిటీలో ఎలాగైన పాగా వేసేందుకు కూటమి నేతలు కుయుక్తులు పన్నుతున్నారు.

ఓటింగ్ ప్రక్రియ ఇలా...

స్టాండింగ్ ఎన్నికల బరిలో 12 మంది సభ్యులు ఉన్నారు. వీరికి 56 మంది కార్పొరేటర్లు ఓట్లు వేసి గెలిపించుకోవాల్సి ఉంది(48 కార్పొరేటర్ టి.కృష్ణారెడ్డి మృతి). ఈ 56 మంది కార్పొరేటర్లు బరిలో ఉన్న 12 మందిలో 6 గురికి ఓట్లు వేయాల్సి ఉంది(క్రాస్ సింబల్). 6 గురికి మించి ఒక్క ఓటు అదనంగా వేసిన సదరు బ్యాలెట్ పేపర్‌ను అధికారులు తిరస్కారిస్తారు. అదే విధంగా ఇద్దరి సభ్యులకి సమానంగా ఓట్లు వస్తే వారి ఇద్దరి పేర్లు లాటరీ పద్ధతిలో లాటరీ తీసి స్టాండింగ్ కమిటీకి ఎన్నిక చేస్తారు.

బరిలో ఉన్న సభ్యులు వీరే...

అడకా పద్మవతి, అంజలి మత్రి, ఈరంటి వరప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, గోపి శ్రీనివాస్, దాసరి లక్ష్మీదుర్గ, దూపాటి వంశీబాబు, నూకవరపు బాలాజీ, ముప్పవరపు భారతి, యాట్ల రవికుమార్, రాజలత బూసి, షేక్ మీరావలిలు ఎన్నికల బరిలో ఉన్నారు. ఉదయం 10.30 గంటలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు బ్యాలెట్ బాక్స్ ఓపెన్ చేసి సభ్యులకు చూపుతారు(ఖాళీ బాక్స్). ఆ తరువాత బాక్స్‌కు తాళం వేస్తారు. ఆ తరువాత ఎన్నిక ప్రక్రియ స్టార్ట్ అయి 3 గంటల ముగుస్తుంది. సాయంత్రం 4 గంటలలోపు ఫలితాలను అధికారులు వెల్లడిస్తారు.

ఐడీ కార్డు వేసుకుని ఓటు వేయడానికి రావాలి

నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నిక పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. కార్పొరేటర్లు ఓటు వేసేందుకు తప్పనిసరిగా తమ ఐడీకార్డు తీసుకుని రావాల్సి ఉంది. జీఎంసీ ప్రధాన ద్వారం వద్ద పోలీసులు ఐడీ కార్డు చెక్ చేసిన తరువాతనే ఓటు వేసేందుకు పంపుతారు. మొబైల్ ఫోన్, పెన్నులు, ఇతర వస్తువులు తీసుకురాకూడదు. ఒక వేళ తీసువస్తే ప్రత్యేకంగా ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో మొబైల్ ఫోన్లు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

– చల్లా ఓబులేసు, స్టాండింగ్ కమిటీ ఎన్నికల అధికారి, అదనపు కమిషనర్

కేంద్ర బడ్జెట్‌పై భిన్నస్వరాలు

కేంద్ర ప్రభుత్వం శనివారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రాష్ట్ర ప్రజలను నిరాశకు గురిచేసింది. విభజన హామీల అమలుకు భారీగా నిధులు కేటాయింపు ఉంటాయని ఆశించారు. కానీ ఫలితం లేకుండా పోయింది. ఉద్యోగులకు ట్యాక్స్ మినహాయింపు ఊరటనిచ్చింది. రైతులు, కార్మికులకు ఎలాంటి హామీ లభించలేదు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల ఉపసంహరణతో కార్పొరేట్ లబ్ధి చేకూర్చే బడ్జెట్ అంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. అధికార పార్టీ నాయకులు మాత్రం అన్ని వర్గాలకు మేలు చేసే బడ్జెట్ అంటూ కితాబు ఇస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

కార్మిక వర్గానికి ప్రయోజనం లేదు



బడ్జెట్ మొత్తం 50.65 లక్షల కోట్లు కాగా ఇందులో కార్మిక వర్గానికి ఎటువంటి ప్రయోజనం చేకూర్చే పథకాలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టలేదు. నరేంద్ర మోదీ ప్రభుత్వం బడా పారిశ్రామిక వేతలకు ఇచ్చే పన్ను మినహాయింపులలో కనీసం సగభాగం కూడా కార్మిక వర్గ ప్రయోజనాల కోసం కేటాయించలేదు. దీర్ఘకాలంగా కార్మికుల సమస్యల ప్రస్తావన లేకపోవడం నిరాశ కలిగించింది.

–రావుల అంజిబాబు, ఏఐయూటీసీ నగర సమితి అధ్యక్షుడు

సీనియర్ సిటిజన్లపై చిన్నచూపు



ఆదాయపున్ను మినహాయింపు పెంపుదలపై కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించడం మంచి పరిణామం. సీనియర్ సిటిజన్లపై చిన్నచూపు చూశారు. ఏడాదికి రూ.12.75 లక్షల వరకు పన్ను చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో ఉద్యోగులకు రూ.75 వేలు వరకు పన్ను ఆదాయ అవుతుంది. తద్వారా ఉద్యోగుల కొనుగోలు శక్తి పెరగడంతో జీఎస్టీ ఆదాయం పెరుగుతుంది. సీనియర్ సిటిజన్లకు పన్ను శ్లాబుల్లో ఎటువంటి ప్రత్యేక రాయితీ ఇవ్వకుండా వారిని చిన్నచూపు చూశారు.

– సీవీఎస్ మణి, విశ్రాంత ఉపాధ్యాయుడు

ఆంధ్రప్రదేశ్‌కు వరాల జల్లు



గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్డీఏ ప్రభుత్వం నేడు ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రబడ్జెట్‌లో నిధులు కేటాయించింది. కూటమి ప్రభుత్వానికి బీజేపీ ఎంతో మద్దతుగా నిలిచి రాజధాని అభివృద్ధి కోసం, పోలవరం కోసం నిధులు ఇచ్చింది. మధ్యతరగతి ప్రజలకు పన్ను రాయితీ కల్పించి ఎంతో మేలు చేసింది. క్యాన్సర్ రోగులకు దిగుమతి చేసుకునే మందుల్లో సుంకం తీసేసింది. ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ ఏపీకి అధిక మొత్తంలో కేటాయించారు.

– సుఖవాస శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

ఉద్యోగులకే పన్ను మినహాయింపు



ఆదాయపు పన్ను పరిధిని రూ.12.75 లక్షల వరకు పెంచినప్పటికీ అది ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ లబ్ధిని చేకూర్చే విధంగా లేదు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ విధిగా ఆదాయపు పన్ను చెల్లించాల్సిందే. కేవలం పొదుపు చేస్తున్న వారికే పన్ను మినహాయింపు ప్రయోజనం దక్కుతుంది. కేంద్ర నిర్ణయం సాధారణ వేతన జీవులకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చదు.

–ఏసీవీ గురువారెడ్డి, పీఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంటూరు

బడుగు, బలహీన వర్గాలకు అనుకూలమైన బడ్జెట్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్ మధ్యతరగతి ప్రజానీకానికి ఊరటనిచ్చే బడ్జెట్‌గా ఉందని బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు వి.పాండురంగ విఠల్ అన్నారు. బడ్జెట్‌లో ఉద్యోగులు, చిన్న, సన్నకారు ప్రజలకు ఆదాయ పన్ను స్లాబ్ సవరించడం అభినందనీయమన్నారు. రూ.12లక్షల వరకు జీరో ట్యాక్స్ అనేది స్వాగతించదగిన పరిణామమన్నారు. బడ్జెట్ బడుగు బలహీన వర్గాలకు మధ్యతరగతి ప్రజలకు అనుకూలమైన బడ్జెట్ అన్నారు.

– పాండురంగ విఠల్,బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు

కేంద్ర బడ్జెట్‌లో ఏపీ ప్రస్తావనే లేదు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్



లక్ష్మీపురం: కేంద్ర బడ్జెట్ సామాన్యులకు శాపంగా, బడా పెట్టుబడిదారులకు వరంగా ఉందని, అసలు ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ గురించి ప్రస్తావనే లేక పోవడం విచారకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో బడ్జెట్‌పై శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. త్వరలో ఎన్నికల దృష్ట్యా బిహార్‌కు మాత్రం వరాలు కురిపించారని ఆరోపించారు. సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకు కేంద్రం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించటం, ప్రభుత్వ రంగ సంస్థలలోని పెట్టుబడులను రెండో విడతగా ఉపసంహరించాలనుకోవటం, ఆస్తుల విక్రయం, ప్రైవేటు భాగస్వామ్యంతో మారిటైం మిషన్, ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించటం వంటి నిర్ణయాలు కార్పొరేటర్ అనుకూల అంశాలుగా ఉన్నాయన్నారు.

మౌలిక సమస్యలను విస్మరించిన కేంద్ర బడ్జెట్

ఎల్‌ఐసీ యూనియన్ నాయకుడు సురేష్

కొరిటెపాడు(గుంటూరు): ద్రవ్యోల్బణం, అధిక ధరలు, ఉపాధి కొరత, రైతులకు గిట్టుబాటు ధర చట్టబద్ధత, కోట్లాది మంది కార్మికులకు కనీస వేతనాలు పెంపుదల వంటి దేశ ప్రజల ముందున్న ముఖ్యమైన సమస్యలకు ఎటువంటి సరైన పరిష్కారాలను కేంద్ర బడ్జెట్లో ప్రకటించలేదని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 నుంచి 100 శాతానికి పెంచాలని నిర్ణయించడం దేశ ఆర్థిక ప్రయోజనాలకు హానికరమని విమర్శించారు. ఒక పక్క వికసిత్ భారత్ లక్ష్యమంటూ ప్రకటించిన ప్రభుత్వం సుస్థిర, సమ్మిళిత, సమగ్ర అభివృద్ధిని సాధించే దిశగా అందుకు తగిన ప్రణాళికను బడ్జెట్‌లో రూపొందించలేదని ఆరోపించారు. పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల విక్రయం వంటివి ఆర్థిక స్వావలంబనను దెబ్బతీసే చర్యలని కోరారు. దేశంలో ఆర్థిక అసమానతలు మరింత పెరిగేలా కేంద్ర బడ్జెట్ ఉందని అభిప్రాయపడ్డారు.

రాష్ట్రానికి మొండిచేయి చూపిన బడ్జెట్

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ



లక్ష్మీపురం: కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని, విభజన హామీలు, రాజధాని నిర్మాణం విషయంలో మొండిచేయి చూపిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి విమర్శించారు. ఢిల్లీ, బిహార్ ఎన్నికలను దృష్టిపెట్టుకుని ప్రవేశపెట్టినట్లు ఉందని చెప్పారు. విభజన హామీల అంశం బడ్జెట్‌లో అసలు ప్రస్తావన తీసుకురాలేదని పేర్కొన్నారు. పోలవరానికి రూ.5,936 కోట్లు, ప్రాజెక్ట్ అథారిటికి రూ.54 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. కాని నిర్వాసితుల గురించి, వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారం గురించి మాత్రం మాట్లాడలేదన్నారు. రైతాంగం ఢిల్లీ సరిహద్దులలో ఆందోళన చేస్తున్న గతంలో వారికి ఇచ్చిన హామీల ప్రస్తావ లేదని ధ్వజమెత్తారు. బడ్జెట్ మొత్తం పేద, మధ్యతరగతి ప్రజల నుంచి వసూలు చేసి ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధంగా ఉందని విమర్శించారు.

పార్లమెంట్‌లో ఎంపీలు నిద్రపోతున్నారా..

కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి



లక్ష్మీపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకించి బడ్జెట్‌లో ఒక్కటి కూడా కేటాయించకపోవడం చాలా సిగ్గుచేటు అని కాంగ్రెస్ పార్టీ మాజీ శాసన సభ్యుడు షేక్ మస్తాన్‌వలి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం కేంద్ర బడ్జెట్ కేటాయింపుపై ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఎంపీలు గుర్రుపెట్టి నిద్రపోతున్నట్లు ఉందని చెప్పారు. గతంలో పోలవరానికి రాజధానికి ఇచ్చిన అప్పులను బడ్జెట్‌లో చూపించి గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందని వివరించారు. ఆర్థిక నిపుణులు దీని మీద మాట్లాడాలని చెప్పి డిమాండ్ చేస్తూ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటు కార్పొరేట్ చేతుల్లో కీలుబొమ్మలాగా అవుతుందని భావిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఎలాంటి పోరాటాలకు అయిన సిద్ధంగా ఉందని చెప్పారు.

ఆటోవాలాలకు అండగా ఉంటా !

- ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్
- మనమంతా అన్నదమ్ముల్లాంటి వాళ్లం
- ప్రజల రక్షణే ధ్యేయంగా ముందుకు సాగుదాం



ఆటోవాలాలతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన డీఎస్పీ రమేష్ తదితరులు

పట్నంబజారు: "మనమంతా అన్నదమ్ముల్లాంటి వాళ్లం.. మీకేదైనా సాయం కావాల్సి వస్తే చేసేందుకు నేను సిద్ధంగా ఉన్నా..ఆటోవాలా అంటే అన్నదమ్ముల్లా.. తండ్రిలా ప్రయాణికుడికి ధైర్యం కలిగేలా వ్యవహరించాలి" అని గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ సూచించారు. గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం ఆటోలకు ట్రాఫిక్ పోలీసు నంబర్ ప్లేట్లు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం. రమేష్, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఏ. అశోక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఆటోలకు ట్రాఫిక్ పోలీస్ నంబర్ అనేది ఆధార్ నంబర్ లాంటిదని, ప్రయాణికుల భద్రత కోసం ఎంతో అవసరమని తెలిపారు. నగరంలో మొత్తం 14 వేల మందిని గుర్తించామన్నారు. ట్రాఫిక్ పోలీస్ నంబర్ తీసుకోవాలంటే ఆటో ఓనర్, డ్రైవర్లు వాహనానికి సంబంధించిన పూర్తి వివరాలతో పాటు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను పోలీసులకు అందించాలని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ లోపు ఈ ట్రాఫిక్ పోలీసు నంబర్లను తప్పనిసరిగా ప్రతి ఆటోపై కనిపించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేర, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు తీసుకొని నిర్ణయాలకు ఆటోవాలాలు సహకరించాలని ఆయన కోరారు. జిల్లా వ్యాప్తంగా ఆటోలకు నంబర్లు కేటాయింపుపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం ట్రాఫిక్ స్టేషన్‌ను పరిశీలించారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రవీంద్ర, శ్రీహరి, సాంబశివనాయక్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ గుర్తించి ప్రోత్సహించాలి

జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక



విద్యార్థినులను బహుమతులు అందజేస్తున్న డీఈఓ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లోని సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికి తీసేందుకు పాఠశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి అధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో పాఠశాలస్థాయి విద్యార్థులకు 'క్రాఫ్టర్స్' పేరుతో క్విజ్, నృత్య, అనుకరణ, చేతిరాత, సింగింగ్, క్రాఫ్ట్, క్రియేటివ్, కన్య, నేచురల్, తదితర 14 అంశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. శనివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గెలుపోటములతో సంబంధం లేకుండా ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రధాని మోదీ ఫ్యూచర్ ఇండియా, వైబ్రేట్ ఇండియా నినాదాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు భావి భారత మెరుగైన పౌరులుగా ఎదిగేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. క్రాఫ్టర్స్ కార్యక్రమం ద్వారా జిల్లా, నగర స్థాయిలో 1,500 మంది విద్యార్థులు ఆయా పోటీల్లో చురుగ్గా పాల్గొన్నారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, కార్యక్రమాల కన్వీనర్లు, సుస్మిత, నాగాంజనేయులు, సందీప్ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా సామూహిక లక్ష కుంకుమార్చన

నగరంపాలెం: స్థానిక ఆర్అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారం దేవస్థానంలో ఆత్మార్పణ దినోత్సవ పూజలు శనివారం రెండో రోజు కొనసాగాయి. ఉదయం 10 గంటలకు సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం ఈసీ సభ్యులు కొనకళ్ల సత్యం, గుడివాడ రవి, కోట శేషగిరి, బొల్లిశెట్టి పాపారావు, టంగుటూరి అర్జున్‌రావు, ఎం.గౌరీశంకర్, మహిళా నాయకురాలు ఓలేటి షర్మిల, కోశాధికారి నాగలక్ష్మీ, కొనకళ్ల అరుణాదేవి, కోట ధనలక్ష్మీ, అమర షర్మిల పాల్గొన్నారు.

సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు

నెహ్రూనగర్: పింఛన్ల పంపిణీ విధుల్లో నిర్లక్ష్యం కనబరిచిన ఎనిమిది మంది వార్డు సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శనివారం ఉదయం 6 గంటల నుంచే పంపిణీ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. కానీ కార్యదర్శులకు పలుమార్లు వాట్సాప్ మెసేజెస్ ద్వారా, నోడల్ అధికారుల ద్వారా ఆదేశించిన స్పందించ లేదని చెప్పారు. డి.స్వాతి(18) రెవెన్యూ సెక్రటరీ, వై.ఫణి కిషోర్(27) శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీ, ఎ.శ్రీనివాసరావు(115) అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, కె.మధుకిరణ్(159) ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వి.సెబాస్టియన్(184) రెవెన్యూ సెక్రటరీ, కె.స్వాతి(187) ఉమెన్ – వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ సెక్రటరీ, కె.రమణ అప్పల నాయుడు(187) ఎమినిటిస్ సెక్రటరీ, వి.ఉషా రాణి (205) వార్డు హెల్త్ సెక్రటరీలు ఉదయం 9 గంటల వరకు లాగిన్ అవ్వకపోవడం, పింఛన్ పంపిణీ ప్రారంభించక పోవడంపై షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో శ్రీమేధ-కెరీర్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూ శుక్రవారం ప్రకటించిన డిగ్రీ తృతీయ సెమిస్టర్ ఫలితాల్లో శ్రీమేధ-కెరీర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు సంస్థ డైరెక్టర్లు శేషసాయిబాబు, అన్నా నందకిషోర్ తెలిపారు. శనివారం కొత్తపేటలోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బీకాం కంప్యూటర్స్ విభాగంలో బట్టు షారోనికా 800 మార్కులకు గాను 700 మార్కులు, ఎ.మహేశ్వరి 680, షేక్ క్యూబా కౌసైన్ 672, నెమలి స్తుతి హర్షిత 652, బీకాం జనరల్ విభాగంలో ఆలివ్ గ్లోరియానా 600 మార్కులకు 522, షేక్ సుమయ తస్నిమ్ 511, పొట్టి సాయి శ్రీకీర్తి 497, రితిక కుమారి 488 మార్కులు సాధించినట్లు వివరించారు.

సెయింట్ జోసఫ్‌కు నాక్ ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని సెయింట్ జోసఫ్ మహిళా బీఈడీ కళాశాలకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. స్వరూపరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 23,24వ తేదీల్లో జరిగిన నాక్ బృంద పర్యటన అనంతరం రాష్ట్రంలోనే ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు పొందిన విద్యాసంస్థగా నిలిచిందని తెలిపారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ ట్రీసా, ఏవో సిస్టర్ రోజిలిన్, నాక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ గ్రేస్ ఇందిర విద్యార్థులను, సిబ్బందిని అభినందించారు.

నారాయణ స్కూల్లో ఈ-కిడ్జ్ స్పెల్‌బీ పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: స్తంభాలగరువులోని నారాయణ స్కూల్లో శనివారం ఈ-కిడ్జ్ స్పెల్‌బీ గ్రాండ్ ఫైనల్స్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన విద్యార్థులు పోటీల్లో భాగంగా స్పెల్లింగ్ పలకడంలో నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈసందర్భంగా విజేతలకు ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం శ్రీనివాసులు రెడ్డి, ఏజీఎంలు వెంకటేశ్వరరావు, నాగరాజు, లక్ష్మణరెడ్డి, జానకిరామ్‌రెడ్డి, విజయబాబు, హుస్సేనయ్య, పాట్రిక్, జోనల్ కో-ఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్ వై. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధ్యాత్మిక, యోగా ప్రయోజనాల కోసమే ప్రపంచదేశాలు భారతదేశంవైపు దృష్టి సారిస్తున్నాయని స్వామి రితేదేవ్ మహారాజ్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల ప్రాంగణంలో పతంజలి-భారత స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత ఐదురోజులుగా నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమం శనివారం ముగిసిన సందర్భంగా యువత కోసం యోగా-స్వదేశీ సేవ సాధన, స్వాభిమానం అనే అంశంపై ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో పతంజలి యోగా సభ్యుడు జొన్నలగడ్డ శ్రీనివాస్, కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, విస్తృతి కార్యాచరణ సమితి ఉపాధ్యక్షురాలు పి.నాగ సుశీల పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మూట్‌కోర్టు పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: న్యాయవాద వృత్తిలో రాణించేందుకు భాషా నైపుణ్యాలతో పాటు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జాగర్లమూడి చంద్రమౌళి(జేసీ) న్యాయ కళాశాల పాలకమండలి ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్ అన్నారు. శనివారం జేకేసీ కళాశాల రోడ్డులోని జేసీ లా కళాశాలలో నాలుగో జాతీయస్థాయి మూట్‌కోర్టు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ విస్తృత పఠనానికి గ్రంథాలయాలు తోడ్పడతాయని చెప్పారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి పి.గోపీచంద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్‌బాబు, మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ విద్యాసంస్థల నుంచి 35 జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్లు వివరించారు.

వర్సిటీ ఎదుట ఏఐఎస్ఎఫ్ నిరసన



వర్సిటీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

లక్ష్మీపురం: వైస్ చాన్సలర్‌లను గవర్నర్లకు కట్టబెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్)ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ ఉన్నత విద్యారంగంలో ప్రమాదకరమైనదిగా ఈ ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. యూజీసీ ముసాయిదా పేరుతో తీసుకుంటున్న చర్యలు, పరిపాలన పరమైన సమస్య కాదని ఇది భారత రాజ్యాంగ నిర్మాణంపై దాడి అని పేర్కొన్నారు. భారతదేశంలో విశ్వవిద్యాలయాల సైద్ధాంతిక నియంత్రణ కార్పొరేట్ శక్తులు లాభదాయక సాధనగా హిందుత్వ ప్రచార సాధనలాగా మారకుండా ఉద్యమించాల్సిన అవసరం ఉంది అన్నారు. యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలు వ్యతిరేకంగా ఉద్యమించడానికి విద్యార్థులు సమయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, యూనివర్సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాసరయ్య, రాజేష్, భరత్ పాల్గొన్నారు.

మానసిక ఎదుగుదలకు సాహిత్యం దోహదం

నగరంపాలెం: మానసిక ఎదుగుదలకు సాహిత్యం, కళారూపాలు దోహదం చేస్తాయని ఆర్ట్ ఫిలిం హీరో భూపాల్ అన్నారు. అఖిల భారత ప్రజాసాహిత్య సాంస్కృతిక వేదిక (ఏఐపీఎల్‌సీఎఫ్) ఆధ్వర్యంలో గుంటూరు వైద్య కళాశాల ఎదురున్న ఎన్జీఓ కల్యాణ మండపంలో నిర్వహిస్తోన్న అఖిల భారత ప్రజాసాహిత్య, కళా, సాంస్కృతిక సభ శనివారం రెండో రోజుకు చేరాయి. నాయకులు రమణప్రసాద్, శ్రీదేవీ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, త్రిపుర, నాగాలాండ్, మణిపూర్, తమిళనాడు రాష్ట్రాల నుంచి విచ్చేసిన జానపద, ఆదివాసి కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. అంకురం సినీ దర్శకులు సి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో సినిమాలు ప్రజలను వెర్రితలలు వేస్తు ఉన్మాదానికి గురి చేసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాహిత్య, సాంస్కృతిక, కళారూపాల, వారసత్వాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ ఉపాధ్యక్షులు దివి కుమార్, కార్యదర్శి డాక్టర్ బి.అరుణ పాల్గొన్నారు.

మానవ జీవితంలో రసాయన శాస్త్రం కీలకం



గుంటూరు ఎడ్యుకేషన్: మానవ జీవితంలో రసాయన శాస్త్రం ఎంతో కీలకమని గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల రసాయనశాస్త్ర విభాగాధిపతి బి.జాయిస్ ఎన్‌జే కుమారి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో శనివారం డిగ్రీ విద్యార్థులకు అతిథి ఉపన్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.భానుమురళి, రసాయన శాస్త్ర విభాగాధిపతి బి.జ్యోతి, అధ్యాపకురాలు వై.అన్నపూర్ణ పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం గద్దర్ జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం, రాజకీయ విశ్లేషకులు గూడవల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



కొరిటెపాడు: చదువులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర తెలిపారు. 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ – గుంటూరు' 'కోపా – విసన్నపే' వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన 268 మంది పేద విద్యార్థులకు రూ.8.88 లక్షల ఉపకార వేతనాలు ఆదివారం పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. రూ.4.30 లక్షలు తులసి సీడ్స్ 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ ' ద్వారా 130 మంది పేద విద్యార్థులకు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమం విసన్నపేటలోని వికాస్ డిగ్రీ కళాశాల ఆవరణ ఈనెల 2న మధ్యాహ్నం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరవుతారని వెల్లడించారు.